సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
సోమవారం । 15 । మే । 2023



నేటి నుంచి ఏపీఈఏపీసెట్

ఇంజినీరింగ్, అగ్రి, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఏపీఈఏపీ సెట్ ప్రారంభం కానుంది.

8లో



'స్నాతకోత్సవ' గడువు పొడిగింపు

ఎస్కేయూ స్నాతకోత్సవ పట్టా దరఖాస్తు గడువును ఈ నెల 22 వరకు పొడిగించినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
39.7°/23.4°

జిల్లా అంతటా ఆదివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవితాపం, ఉక్కపోత పెరిగింది. గంటకు 5 నుంచి 8 కి.మీ వేగంగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు ప్రభుత్వ సలహాదారు నాగార్జునరెడ్డి రాక



పుట్టపర్తి అర్బన్/చిలమత్తూరు: పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి సోమవారం జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. చిలమత్తూరులో సోమవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకూ జాతీయ ఉపాధి హామీ పథకం పై సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం చిలమత్తూరు మండలంలోని సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ జగనన్న కాలనీలు, పంచాయతీరాజ్ రోడ్లు, ఆర్‌డబ్ల్యూఎస్ స్కీంలపై హిందూపురంలో సమీక్ష ఉంటుందన్నారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక ఎమ్మెల్సీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మార్కెట్ యార్డు చైర్మన్‌లతో మాట్లాడతారని వివరించారు. రాత్రికి హిందూపురం గెస్ట్‌హౌస్‌లో బస చేస్తారన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో సోమవారం జిల్లా స్థాయి స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల సచివాలయ స్థాయిల్లోనూ స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

ఎస్పీ కార్యాలయంలో...

కొత్తచెరువు: జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో ఉన్న ఎస్పీ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం జరుగుతుందని ఎస్పీ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలను అర్జీల రూపంలో జిల్లా వాసులు ఎస్పీ మాధవరెడ్డికి సమర్పించుకోవచ్చన్నారు.

వందశాతం లక్ష్యాలను చేరుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి కృష్ణారెడ్డి

కదిరి టౌన్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్‌వీ కృష్ణారెడ్డి కదిరి మున్సిపల్ పరిధిలోని మూర్తిపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆదివారం తనిఖీ చేశారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఓపీ పేషెంట్ల సంఖ్యతో పాటు ఆస్పత్రిలో కాన్పుల సంఖ్యను పెంచాలన్నారు. హెల్త్ ఐడీలు, ఇన్ పేషంట్ల కేర్‌పై దృష్టి సారించాలని సూచించారు. నేషనల్ ప్రోగ్రాముల్లో ప్రతి దాంట్లో వందశాతం లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు.



హిందూపురం: పట్టణంలో భారీ హనుమాన్ విగ్రహంతో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

జై హనుమాన్

అంజనీపుత్ర హనుమాన్‌కీ జై అంటూ అన్ని ప్రాంతాల్లోనూ హనుమంతుడిని కీర్తిస్తూ ర్యాలీలు, ప్రత్యేక ఉత్సవాలను జరుపుకున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం హనుమజ్జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. హిందూపురం పట్టణంలో హిందూ సురక్షా సేవా సమితి ఆధ్వర్యంలో వేలాది మంది హనుమాన్ భక్తులు శోభయాత్ర చేపట్టారు. అలాగే ధర్మవరం, పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ, కదిరి నియోజకవర్గాల్లోని అంజన్న ఆలయాల్లో తెల్లవారుజామునుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

సాక్షిబృందం:



ధర్మవరం: వడమాల అలంకరణలో కొత్తపేట ఆంజనేయస్వామి

మార్కెట్లకు మంచిరోజులు

- జిల్లా వ్యాప్తంగా 79 శాతం మేర మార్కెటింగ్ ఫీజు వసూళ్లు
- పుట్టపర్తిలో గరిష్టంగా 109 శాతం రాబడి
- తనకల్లులో కనిష్టంగా 30 శాతం వసూలు
- రూ.5.24 కోట్ల లక్ష్యంలో రూ.4.14 కోట్ల వసూలు



హిందూపురం మార్కెట్‌లో చింతపండు విక్రయాలు (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి: మార్కెటింగ్ ఫీజుల వసూళ్లలో కొత్తగా ఏర్పడిన శ్రీ సత్యసాయి జిల్లా తొలి ఏడాది ఆశాజనకంగా ఫలితాలు సాధించింది. జిల్లా వ్యాప్తంగా 8 మార్కెట్ కమిటీలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. అన్ని మార్కెట్‌లకు కలిపి 2022–23 ఆర్థిక సంవత్సరం లక్ష్యం రూ.5.24 కోట్లకు గానూ.. రూ.4.14 కోట్లు (79 శాతం) వసూలైంది. ఇందులో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం, గోరంట్ల అత్యధిక వసూళ్లు సాధించాయి. తర్వాత స్థానాల్లో మడకశిర, హిందూపురం, పెనుకొండ, తనకల్లు మార్కెట్లు నిలిచాయి. అదేవిధంగా హిందూపురం మార్కెట్ నుంచి ప్రభుత్వానికి ఏడాదిలో రూ.1.57 కోట్ల రాబడి వచ్చింది.

పుట్టపర్తిలో 109 శాతం

జిల్లాలోని మార్కెట్ యార్డుల్లో ఫీజుల వసూలులో పుట్టపర్తి 109 శాతంతో మొదటి స్థానంలో ఉంది. కదిరి 94 శాతం, ధర్మవరం 90 శాతం, గోరంట్ల 86 శాతంతో తొలి వరుసలో ఉన్నాయి. ఆ తర్వాత పెనుకొండ 67 శాతం, హిందూపురం 70 శాతం, మడకశిర 83 శాతం వసూళ్లు సాధించాయి. అత్యల్పంగా తనకల్లులో 30 శాతం మాత్రమే ఫీజులు వసూలయ్యాయి. పుట్టపర్తి మార్కెట్ యార్డు నుంచి ప్రభుత్వానికి రూ.49.41 లక్షల ఆదాయం వచ్చింది.

మార్కెట్ల వివరాలు

జిల్లా వ్యాప్తంగా 8 మార్కెట్ కమిటీలకు సంబంధించి 15 (ధర్మవరం, బత్తలపల్లి, రాళ్ల అనంతపురం, కొక్కంటి క్రాస్, మహమ్మదాబాద్, కుటాగుళ్ల, గుమ్మయ్యగారిపల్లి, పాలసముద్రం, తనకల్లు, పెనుకొండ, కొడికొండ, మేళాపురం, మడకశిర, కొత్తచెరువు, ఓడీ చెరువు) చెక్‌పోస్టులు ఉన్నాయి. ఒక్కో మార్కెట్ యార్డులో 12 మంది రైతులు, ముగ్గురు వ్యాపారులు కమిటీ సభ్యులుగా ఉంటారు. స్థానిక ఎమ్మెల్యే గౌరవ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. చింతపండు సీజన్ నవంబరు, డిసెంబరు, జనవరిలో మాత్రమే ఉంటుంది. ఎండు మిర్చి ఆగస్టు నుంచి డిసెంబరు వరకు ఉంటుంది.

సంతల నిర్వహణ ఇలా...

- కొత్తచెరువు (పుట్టపర్తి)లో బుధవారం మేకలు, గొర్రెల సంత ఉంటుంది.
- గోరంట్లలో సోమవారం గొర్రెలు, మేకలు, గురువారం ఎద్దులు, ఎనుముల క్రయవిక్రయాలు జరుగుతాయి.
- కదిరిలో మంగళవారం గొర్రెలు, మేకలు, బుధవారం పశువుల సంత నిర్వహిస్తారు. శనివారం చింత పండు మార్కెట్ నిర్వహిస్తారు.
- హిందూపురంలో సోమ, గురువారాల్లో చింతపండు, మంగళ, శుక్రవారాల్లో ఎండుమిర్చి వ్యాపారం ఉంటుంది.

2022-23 లక్ష్యం, వసూళ్లు ఇలా...

- ధర్మవరం మార్కెట్ రూ.54 లక్షల లక్ష్యానికి రూ.48.71 లక్షలు సాధించింది.
- గోరంట్ల మార్కెట్ రూ.55 లక్షల టార్గెట్‌లో రూ.47.72 లక్షలు వసూలు చేసింది.
- హిందూపురం మార్కెట్ లక్ష్యం రూ.2.25 కోట్లు కాగా రూ.1.57 కోట్లు రాబట్టింది.
- కదిరి మార్కెట్ రూ.76 లక్షల టార్గెట్‌లో రూ.72.17 లక్షలు వసూలు చేసింది.
- మడకశిర మార్కెట్ టార్గెట్ రూ.22.50 లక్షలకు రూ.18.71 లక్షలు సాధించింది.
- పెనుకొండ మార్కెట్ కమిటీ రూ.15 లక్షల సాధనలో రూ.10.07 లక్షలు వసూలు చేసింది.
- పుట్టపర్తి మార్కెట్ యార్డు లక్ష్యం రూ.45 లక్షలు కాగా రూ.49.41 లక్షలు వసూలైంది.
- తనకల్లు మార్కెట్ టార్గెట్ రూ.32 లక్షలకుగానూ రూ.9.81 లక్షలు సాధించింది.



పారదర్శకత పాటిస్తున్నాం



ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి ఏపీ మీదుగా వెళ్లే సరుకులకు ఎలాంటి సుంకం వసూలు చేయబోం. పక్క రాష్ట్రానికి దిగుమతి, ఎగుమతులపై ఒక్క శాతం సెస్ వసూలు తప్పనిసరి. అయితే ఎండుమిర్చి, ధనియాలు, పప్పుశనగ, కందులు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి అయిన తర్వాత ప్రాసెసింగ్ చేసి ఇక్కడే విక్రయాలు చేస్తే ఎలాంటి సెస్ ఉండదు. పారదర్శకత పాటిస్తూ.. సెస్ వసూళ్లలో ఎలాంటి రాజీ పడకుండా అధిక ఆదాయం సాధిస్తున్నాం.

– ఎంఎల్ఎస్ మూర్తి, మార్కెటింగ్‌శాఖ ఏడీ

గిరిజన గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉరవకొండ: స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరానికి గాను మూడో తరగతి నుంచి ఆరో తరగతి వరకు ప్రవేశాలకు అర్హులైన బాలికలు ఈ నెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈమేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మూడో తరగతిలో 40 సీట్ల (ఎస్టీలకు 30, ఎస్సీలకు 5, బీసీలకు 2, ఓబీసీలకు, ఏఈక్యూలకు 1, పీజీటీలకు 1)ను రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేస్తామని పేర్కొన్నారు. నాలుగో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు 93 సీట్లను ఎస్టీ విద్యార్థినులతో మాత్రమే భర్తీ చేస్తామని వెల్లడించారు. తల్లిదండ్రుల ఆదాయం ఏడాదికి రూ.లక్షలోపు ఉండాలన్నారు. నాలుగో తరగతిలో 32, ఐదో తరగతిలో 26, ఆరోతరగతిలో 15, అలాగే 7, 8, 9 తరగతిలో 13 సీట్లు చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. అర్హులైన వారు నేరుగా ఉరవకొండ పట్టణంలోని శాంతినగర్‌లో పాఠశాలకువచ్చి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. తరగతుల వారీగా వచ్చిన దరఖాస్తులను క్రోడీకరించి జూన్ 10న జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సమక్షంలో లాటరీ ద్వారా ఎంపిక చేస్తామని తెలిపారు.

శ్రీగంధం సాగుపై రేపు అవగాహన సదస్సు

బుక్కరాయసముద్రం: రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 16న బెంగళూరుకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (ఐడబ్ల్యూఎస్టీ) వారి సహకారంతో శ్రీగంధం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లేశ్వరి తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీగంధం సాగులో రైతులకు మెలుకువలు, యాజమాన్య పద్ధతులు, సందేహాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.



నిర్మానుష్యంగా మారిన పుట్టపర్తి రైల్వేస్టేషన్ ప్రాంగణం

'సన్' డే

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో దాదాపుగా గత వారం వానలు పడటంతో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందిన జనానికి ఆదివారం సన్‌స్ట్రోక్ తగిలింది. సెలవుదినానికి తోడు ఎండవేడిమి ఎక్కువ ఉండటంతో ప్రజలు రోడ్డు మీదకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆయా ప్రాంతాల్లోని వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. ముఖ్యంగా జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదుకావడంతో జనం అల్లాడిపోతున్నారు. మరో రెండు రోజులు వేడిగాలులు వీచే సూచనలు ఉన్నాయని వాతావరణ శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని సూచించారు.



ప్రయాణికులు లేక వెలవెలబోతున్న పుట్టపర్తి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం

పట్టుకు ఎండ దెబ్బ

- గాలితో తగ్గుతున్న తేమశాతం
- పాలపురుగు, చప్పిడి రోగాలు ప్రబలే అవకాశం
- రేరింగ్ గదుల్లో ఉష్ణోగ్రతలపై రైతుల బెంబేలు



వైరస్ సోకిన పట్టుగూళ్లు



హిందూపురం పట్టుగూళ్ల మార్కెట్‌లో కొనసాగుతున్న విక్రయాలు

హిందూపురం: ఎండ.. పరిమితంగా కాస్తే సరే.. లేదంటే ప్రమాదమే.. వేసవిలో ఎండలు మండుతున్నాయి. మే నెలలో మరీ ఎక్కువయ్యాయి. ఎండ వేడిమిని తాళలేక మనుషులతో పాటు పశు,పక్షాదులు అల్లాడుతున్నాయి. అయితే ప్రస్తుతం పంటలు కూడా ఎండిపోతున్నాయి. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో 'పట్టు'పైనా ప్రభావం పడుతోంది. అధిక ఉష్ణోగ్రతతో పట్టు పురుగులకు పాలకారు, చప్పిడి రోగాల బారిన పడి పురుగులు గూడులోనే చనిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మొచా తుపాను ప్రభావం

ప్రస్తుతం పెరిగిపోతున్న ఉష్ణోగ్రతతో పాటు మొచా తుపాను ప్రభావం కూడా లేకపోలేదు. బంగాళాఖాతం తుపాను ప్రభావంతో రాయలసీమ ప్రాంతాల్లో చల్లగాలులు వీస్తున్నాయి. గాలిలో తేమను మొచా తూఫాన్ లాగేసే ప్రమాదం ఉంటుందని వాతావరణ శాస్త్రవేత్తలు అంటున్నారు. దీనివల్ల వేడిమి పెరిగి పోతుందన్నారు. ఉత్తర భారతదేశ ప్రాంతం నుంచి వేడి, పొడి గాలులు రాయలసీమ ప్రాంతం గుండా ప్రయాణించి ఈనెల 13వతేదీ పైన అత్యధికమైన ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు పైనే నమోదు అయ్యే అవకాశం ఉంటుంది.

శ్రీసత్యసాయి జిల్లాలో మల్బరీ సాగు ఇలా..	
జిల్లాలో మల్బరీ సాగు	49,067 ఎకరాల విస్తీర్ణం
పట్టుగూళ్ల ఉత్పత్తి	20,776 మెట్రిక్ టన్నులు
మల్బరీ సాగు చేసే రైతులు	26,332 మంది
మార్కెట్‌కు వచ్చే ప్రాంతాల రైతులు : కర్ణాటక ప్రాంతాలు, హిందూపురం, మడకశిర, పెనుకొండ, కళ్యాణదుర్గం	
పురం మార్కెట్‌కు రోజుకు వచ్చే పట్టుగూళ్లు	5 వేల టన్నులు
ఎండ ప్రభావంతో తగ్గిన గూళ్లు	1.75 టన్నులు (రోజుకు)

పాలపురుగు, చప్పిడి రోగం బారిన పడే అవకాశం:

పట్టు పురుగుకు 28 డిగ్రీలకు మించితే ఒత్తిడికి గురై పాల పురుగు లేదా చప్పిడి రోగం బారిన పడే అవకాశం ఉంది. రేరింగ్ గదిలో ఉష్ణోగ్రతతో పాటుగా గదిలో 70 శాతం వరకు గాలిలో తేమ ఉండాలి. బైవోల్టిన్ పట్టు పురుగు గూడు అల్లేది మొదలు పెట్టిన తర్వాత గదిలో గాలిలో తేమ తగ్గించాలి. గూడు అల్లేది మొదలు పెట్టిన తరువాత గదిలో అదేరీతిలో తేమ 70 శాతంపైన ఉంటే గూడు అరిన తరువాత గట్టిగా మారి రీలింగ్‌లో దారం తీయడం కష్టమవుతుంది. పట్టు పురుగు గదిలో తగినంతగా గాలిలో తేమ ఉంటే పట్టు గూడు సైజ్ కూడా ఎక్కువ ఉండే అవకాశాలుంటాయి. పెరుగుతున్న ఎండ వేడిమితో చాలాచోట్ల పట్టు పురుగులకు వైరస్ సోకి పుట్టు గూళ్లు గట్టిపడిపోయినవి, దెబ్బతిన్న గూళ్లు మార్కెట్‌కు వస్తున్నాయి. వాటిని రీలర్లు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తుండటంతో ధరలు రాక రైతులకు తీవ్ర నష్టపోతున్నారు.

పట్టు పురుగులు మేపేగదిలో ఉష్ణోగ్రత 28 డిగ్రీలకు తగ్గించి గాలిలో తేమను 70 శాతంకు పెంచడానికి ఈ క్రింది చర్యలు తీసుకోవాలి.

- వేసవి కాలంలో ఏర్పాటు చేయదలచిన కూలింగ్ ఏర్పాట్లకు షెడ్‌కన్నా ఎత్తులో వాటర్ ట్యాంక్ అవసరం ఉంటుంది. నీటిని మోటార్ ద్వారా స్ప్రింక్లర్లకు అనుసంధానం చేసి, ఎక్కువ ఒత్తిడితో నీటిని పంపుతూ ఏర్పాటు చేసుకోవాలి.
- రేరింగ్ గదిపై భాగంలో ఎండ నేరుగా పడకుండా టెంకాయ పట్టలను లేదా బోదను ఏర్పాటు చేసుకోవాలి. పైభాగంలో తగినన్ని స్ప్రింక్లర్‌ను ఏర్పాటు చేసి, నీటిని సీలింగ్ పైన తడి ఆరకుండా పడేటట్లు చేసుకోవాలి.
- రేరింగ్ గది కిటికీలకు ఒక అడుగు దూరంలో గది చుట్టూ గోనె పట్టను వేలాడదీసి డ్రిప్‌పైపు ద్వారా నీటిని పగలంతా చిన్నగా కారుతూ పట్టలు తడిచేలా చూసుకోవాలి. బయట నుంచి వచ్చే వేడిగాలి గోనె పట్ట నుంచి లోపలికి పోకుండా ఉంటుంది. దీంతో గాలిలో తేమ గదిలో వాతావరణం చల్లగా మారుతుంది.
- గాలిలో తేమ పెరగకపోతే రేరింగ్ గదిలో మైక్రో స్ప్రింక్లర్లు ఏర్పాటు చేయాలి. రాత్రిళ్లు గది మొత్తం అన్ని కిటికీలు తెరచి ఉంచుకోవడం మంచిది.

ఉష్ణోగ్రత కొలిచే సాధనం ఏర్పాటు చేయాలి



పెరుగుతున్న ఎండ వేడిమి వల్ల పుట్టు పురుగులకు బ్యాక్టీరియా, వైరస్ రోగాలు బారిన పడే అవకాశాలున్నాయి. ప్రతిరైతూ రేరింగ్ గదిలో ఉష్ణోగ్రత, గాలిలో తేమ కొలిచే సాధనం (హైగ్రోమీటర్) ఏర్పాటు చేసుకోవాలి. చాలా ఉపయోగకరం. ఉష్ణోగ్రత తగినంత లేకపోతే పట్టుగూళ్ల సైజ్ పెరగకుండా పోతాయి. గూడులోని పురుగు చనిపోయి వాసన వస్తుంది. తద్వారా రైతులు తీవ్ర నష్టపోయే ప్రమాదం ఉంటుంది.

– లక్ష్మిరెడ్డి, పట్టు మార్కెట్ అధికారి, హిందూపురం

క్లుప్తంగా

పాముకాటుతో వృద్ధుడి మృతి



మృతుడు కదిరయ్య

ధర్మవరం అర్బన్: స్థానిక శారదానగర్ నివాసి కదిరయ్య (80) పాముకాటుతో మృతి చెందాడు. మార్కెట్ యార్డుకు సమీపంలో ఉన్న ఓ తోటకు కాపలాదారుగా జీవనం సాగిస్తున్న ఆయన శనివారం రాత్రి ఇంటి నుంచి తోటకు వెళుతుండగా మార్గమధ్యంలో పాము కాటుకు గురయ్యాడు. అటుగా వెళుతున్న వారికి ఈ విషయాన్ని బాధితుడు తెలపడంతో వారు వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే చికిత్సకు స్పందించక ఆయన మృతి చెందాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

‘కియా’ ఉద్యోగి దుర్మరణం



మృతుడు బాల అశోక్ (ఫైల్)

ముదిగుబ్బ: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో కియా ఉద్యోగి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... ముదిగుబ్బకు చెందిన బాల అశోక్ (30)కు భార్య మౌనిక, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధులకు హాజరయ్యేందుకు ముదిగుబ్బ నుంచి స్కూటర్‌లో బయలుదేరిన ఆయనను జొన్నలకొత్తపల్లి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని, పరిశీలించి కేసు నమోదు చేశారు.

నేటి నుంచి ఏపీఈఏపీసెట్

అనంతపురం: రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుంచి ఏపీఈఏపీసెట్ ప్రారంభం కానుంది. ఈ క్రమంలో సెట్ బాధ్యతను రెండో సారి తీసుకున్న జేఎన్‌టీయూ (అనంతపురం).. ప్రవేశ పరీక్ష నిర్వహణను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇందుకు సంబంధించి ఏపీఈఏపీసెట్ రాష్ట్ర చైర్మన్ ఆచార్య జింకా రంగజనార్దన, రాష్ట్ర కన్వీనర్ ఆచార్య సి.శోభాబిందు నేతృత్వంలో ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకూ 136 కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. అలాగే అగ్రి, ఫార్మసీ విభాగాల్లో ప్రవేశాలకు సంబంధించి 22, 23 తేదీల్లో పరీక్ష జరగనుంది.

సాంకేతిక విద్యకు పెరిగిన డిమాండ్..

రాష్ట్రంలో విద్యా దీవెన, వసతి దీవెన పథకాలను జగన్ సర్కార్ పారదర్శకంగా అమలు చేస్తుండడంతో సాంకేతిక విద్యను అభ్యసించే వారి సంఖ్య నానాటికీ పెరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో గత ఏడాది నిర్వహించిన ఏపీఈఏపీ సెట్‌కు సంబంధించి మొత్తం 3,00,111 మంది దరఖాస్తు చేసుకోగా... ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి 2,05,518 మంది, అగ్రి - ఫార్మసీ కోర్సులకు సంబంధించి 93,532 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ ఏడాది ఈ సంఖ్య భారీగా పెరిగింది. ఇంజినీరింగ్ విభాగానికి 2,37,193 మంది, అగ్రి - ఫార్మసీ కోర్సులకు 99,557 మంది, మరో 983 మంది రెండు విభాగాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ లెక్కన గత ఏడాది కంటే 37,622 మంది సాంకేతిక విద్య పట్ల ఆకర్షితులయ్యారనేది స్పష్టమవుతోంది.

హాల్‌టికెట్ సరిచూసుకోండి..

సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఏపీఈఏపీసెట్‌కు సంబంధించి ఇప్పటికే జారీ చేసిన హాల్ టికెట్లలో ముద్రించిన వివరాలు సరి చూసుకోవాలని అభ్యర్థులకు సెట్ చైర్మన్ ఆచార్య జింకా రంగజనార్దన సూచించారు. తేడాలు ఏమైనా ఉంటే ఏపీఈఏపీసెట్-2023 హెల్ప్‌డెస్క్ లేదా ఈ-మెయిల్ ద్వారా సంప్రదించాలని కోరారు.



ఏపీ ఈఏపీసెట్-2023 దరఖాస్తులు ఇలా..

వర్సిటీ పరిధి				
ఏయూ	1,49,596	57,363	408	2,07,367
ఎస్వీయూ	72,620	37,711	273	1,10,604
ఓయూ	12,486	3,307	131	15,924
మొత్తం	2,37,193	99,557	983	3,37,733
జెండర్ వారీగా...				
కేటగిరి	ఇంజినీరింగ్	అగ్రికల్చర్	రెండూ	మొత్తం
అమ్మాయిలు	97,093	71,057	568	1,68,718
అబ్బాయిలు	1,40,100	28,500	415	1,69,015

ఇవి తప్పనిసరి..

- పరీక్ష కేంద్రానికి హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా వ్యక్తిగత గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలి. ఇంటర్మీడియట్ హాల్‌టికెట్, పాస్‌పోర్ట్, పాన్‌కార్డు, ఓటరు ధ్రువపత్రం, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌లలో ఏదైనా ఒకటి వర్తిస్తుంది.
- బ్లూ కలర్ బాల్ పాయింట్ పెన్ను, పూర్తి చేసిన ఆన్‌లైన్ దరఖాస్తు పత్రం, అటెస్ట్ చేయబడిన కుల ధ్రువీకరణ పత్రం (ఎస్సీ, ఎస్టీ కేటగిరి అభ్యర్థులకు మాత్రమే - ఏపీ ఈఏపీసెట్ అర్హత మార్కులు ఎస్సీ, ఎస్టీ కేటగిరి అభ్యర్థులకు లేవు కాబట్టి కుల ధ్రువీకరణ పత్రం అనివార్యం) తీసుకెళ్లాలి.
- అభ్యర్థులు పరీక్ష హాలులోకి ప్రవేశించిన అనంతరం బయోమెట్రిక్ సమాచారాన్ని సేకరించడం జరుగుతుంది. అభ్యర్థులకు ఫొటో తీయడంతో పాటు ఎడమ చేతి బొటనవేలి ముద్రను తీసుకుంటారు. ఈ నేపథ్యంలో అభ్యర్థులు తమ చేతులకు, పాదాలకు ఎలాంటి కెమికల్స్, మెహందీ, ఇంక్ వంటి పదార్థాలు వినియోగించకుండా ఉండడం మేలు.
- పరీక్ష హాలులో ఆన్‌లైన్ దరఖాస్తు ఫారాన్ని పూర్తిగా నింపి, ఫొటోను అతికించి, దానిపై ఇన్విజిలేటర్ ఎదురుగా సంతకం చేసి ఇవ్వాలి.
- పరీక్ష మొదలైన ఉదయం 9 గంటల తర్వాత మధ్యాహ్నం 3 గంటల వరకూ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యంగా వచ్చే వారిని లోపలకు అనుమతించరు. పరీక్ష సమయం పూర్తయ్యే వరకూ అభ్యర్థులను బయటకు పంపరు.
- కేటాయించిన కంప్యూటర్‌లో ఏదైనా సాంకేతిక సమస్య ఉత్పన్నమైతే... వెంటనే ఇన్విజిలేటర్‌కు తెలపాలి. ఒకవేళ సమస్య పరిష్కారం కాకపోతే మరో కంప్యూటర్‌ను కేటాయిస్తారు. ఈ క్రమంలో వృథా అయిన సమయాన్ని అదనంగా ఇస్తారు.
- కాలిక్యులేటర్లు, లాగర్థమ్ టేబుళ్లు, పేజర్లు, మొబైల్ ఫోన్లు, చేతి గడియారాలు, పెద్ద కళ్లద్దాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, ఖాళీ కాగితాలు పరీక్ష కేంద్రంలోకి అనుమతించబడవు.
- అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ దరఖాస్తు చేసి ఉన్నా.. కేవలం ఒకసారి మాత్రమే పరీక్ష రాసే అవకాశం ఉంటుంది. అభ్యర్థులు వారికి కేటాయించిన తేదీన, సెషన్స్ బట్టి హాజరుకావాలి. లేకపోతే గైర్హాజరుగా పరిగణిస్తారు.
- పరీక్ష హాలులో రఫ్‌వర్క్ చేయడానికి అభ్యర్థులకు ఖాళీ కాగితాలు ఇస్తారు. పరీక్ష పూర్తి కాగానే తాము తీసుకున్న కాగితాలపై హాల్‌టికెట్ నంబర్ రాసి ఇన్విజిలేటర్‌కు అందజేయాలి. లేకపోతే వారిని బయటికు పంపరు.
- అభ్యర్థుల మొబైల్ ఫోన్లకు, ఇతర విలువైన ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌లను సురక్షితంగా ఉంచడానికి ఎలాంటి ప్రత్యేకమైన ఏర్పాట్లు ఉండవు.
- ఏ సమాచారం కావాలన్నా https://cets.apsche.ap.gov.in/EAPCET వెబ్‌సైట్‌ను పరిశీలించవచ్చు.
- అనుమానాల నివృత్తికి helpdeskapeapcet2023 @gmail.comకు మెయిల్, లేదా (08554) 234311, 232248 నంబర్లకు కాల్ చేయవచ్చు.

జిల్లాలోని పరీక్ష కేంద్రాలు ఇవే..

జిల్లాలో మొత్తం ఇంజినీరింగ్‌కు 11,359 మంది, అగ్రి - ఫార్మసీ కోర్సులకు 4,898 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వీరికి 8 పరీక్ష కేంద్రాలను కేటాయించారు. కేటాయించిన కేంద్రాల్లో బుక్కరాయసముద్రం మండలంలోని ఎస్ఆర్ఐటీ, ఎస్కేయూ సమీపంలోని అనంతలక్ష్మి ఇంజినీరింగ్ కళాశాల, రాప్తాడు మండలం హంపాపురం సమీపంలోని ఎస్వీఐటీ, అనంతపురం రూరల్ మండలం రుద్రంపేట శివారులోని పీవీకేకే, శ్రీబాలాజీ పీజీ కళాశాల, గుత్తి సమీపంలోని గేట్స్ కళాశాల, తాడిపత్రిలోని సీవీ రామన్, తాడిపత్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (టెక్) కళాశాల ఉన్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో ఇంజినీరింగ్‌కు 936 మంది, అగ్రి - ఫార్మసీ 421 మంది పరీక్షకు హాజరు కానున్నారు. వీరికి పుట్టపర్తిలోని సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాను పరీక్ష కేంద్రంగా ఎంపిక చేశారు.

ప్రాణం బలిగొన్న అతి వేగం



క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

డి.హీరేహాళ్(రాయదుర్గం): అతి వేగం ఓ యువకుడి ప్రాణాలు బలిగొంది. మరో యువకుడిని ఆస్పత్రి పాలు చేసింది. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గం మండలం చదం గొల్లలదొడ్డి చెందిన గోపాల్(28) అదే గ్రామ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం బళ్లారి మార్గం నుంచి రాయదుర్గం వైపు ద్విచక్ర వాహనంపై మిత్రుడు వీరేష్‌తో కలసి వేగంగా దూసుకెళుతూ.. డి.హీరేహాళ్ మండలం కల్యం గ్రామ సమీపంలో వంతెన రక్షణ గోడను ఢీకొన్నారు. గోపాల్ అపస్మారక స్థితికి చేరుకోగా... వీరేష్‌కు తీవ్ర రక్తగాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స అందేలోపు గోపాల్ మృతి చెందాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు సూచన మేరకు వీరేష్‌ను అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తీసుకెళ్లారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు డి.హీరేహాళ్ ఎస్‌ఐ రంగడుయాదవ్ తెలిపారు.

గొర్రెల మందపై చిరుత దాడి



మృతి చెందిన గొర్రెలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

రాయదుర్గం రూరల్: మండలంలోని కాశీపురం శివారులో గొర్రెల మందపై చిరుత దాడి చేసింది. ఈ మేరకు గొర్రెల యజమాని మద్దికెరనాయుడు కుమారుడు హులిరాజు తెలిపాడు. ఇంటి సమీపంలోని దొడ్డిలో వదిలిన గొర్రెలపై ఆదివారం తెల్లవారుజామున చిరుత దాడి చేసింది. 5 గొర్రెలు మృతి చెందాయి. మరో ఆరు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. సమాచారం అందుకున్న అటవీ శాఖ డీఆర్వో బి.లక్ష్మణ్ణ; ధర్మపురి చార్జ్ బీట్ ఆఫీసర్ తిమ్మక్క, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. పశువైద్యాధికారితో పోస్టు మార్టం చేయించారు. బాధితులకు పరిహారం అందజేసేందుకు చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అటవీ అధికారులు భరోసానిచ్చారు. సమీపంలోని కొండల్లో చిరుతలు ఎక్కువగా సంచరిస్తున్నాయని, గొర్రెల మంద చుట్టూ ఎత్తైన కంచెతో పాటు వీలున్న చోట విద్యుత్ బల్బులూ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

నీట మునిగి బాలుడి మృతి



మృతుడు హాజీబాబా

యాడికి: ఈత సరదా ఓ బాలుడి ప్రాణాలు బలిగొంది. తల్లిదండ్రులకు తీరని విషాదం మిగిల్చింది. పోలీసులు తెలిపిన మేరకు.. యాడికి మండలం తిప్పారెడ్డిపల్లికి చెందిన లారీ డ్రైవర్ హాజీపీరా, రమీజా దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. చిన్నకుమారుడు హాజీబాబా (17) ఆదివారం మధ్యాహ్నం స్నేహితులు శ్రీకాంత్, మంజునాథ్‌తో కలసి సమీపంలోని వంకలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో పై నుంచి వంకలోకి తలకిందులుగా దూకిన హాజీబాబా ఎంతసేపటికీ బయటకు రాలేదు. భయపడిన స్నేహితులు వెంటనే సమాచారం అందించడంతో గ్రామస్తులు అక్కడకు చేరుకుని వంకలో గాలించి హాజీబాబాను వెలికి తీసి, 108 అంబులెన్స్ ద్వారా తాడిపత్రిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలుడు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఘటనపై ఎస్‌ఐ గురుప్రసాదరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

నేత్రపర్వం బ్రహ్మరథోత్సవం



భక్తుల మధ్య సాగుతున్న బ్రహ్మరథం

పావగడ: తాలూకాలోని నలిగానహళ్లి గ్రామ సమీపంలో కొలువైన సంకాపుర సువర్చలా ఆంజనేయ స్వామి బ్రహ్మరథోత్సవం ఆదివారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాన్ని వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళవాద్యాల మధ్య రథంలో ప్రతిష్ఠించి మధ్యాహ్నం 1 గంటకు బ్రహ్మ రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు జై హనుమాన్ అంటూ భక్తిశ్రద్ధలతో స్వామి వారికి జేజేలు పలికారు. రథానికి టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో దత్తాత్రేయ, అశ్వర్థనారాయణ, ఆంజనేయ స్వామివారికి మూల మంత్ర, ఆయుష్య, రథాంగ, వాస్తు హోమాలు ఘనంగా నిర్వహించారు.

ఆర్డీటీ సెట్ దరఖాస్తుకు తుది గడువు రేపు

ముదిగుబ్బ: ఈనెల 16వ తేదీ వరకూ ఆర్డీటీ సెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని ఏటీఎల్ సంజీవరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్డీటీ సెట్ ఈనెల 29న జరుగుతుందన్నారు. స్టేట్ సిలబస్‌లో 600 మార్కులకు గాను 500 మార్కులు, సీబీఎస్ఈ సిలబస్‌లో 500 మార్కులకు 420 మార్కులు అంతకుపైన వచ్చిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. ఆర్డీటీ సంఘంలో సభ్యత్వం కలిగిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లోని పిల్లలు ప్రవేటు పాఠశాలలో చదివిన కూడా అర్హులన్నారు. బీసీ స్పాన్సర్ చిల్డ్రన్స్ పిల్లలు ప్రవేటు స్కూల్స్‌లో చదివినా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఇతర బీసీ, ఓసీ వారు ప్రభుత్వ స్కూల్స్‌లో మాత్రమే చదివి ఉండాలని వెల్లడించారు. పదో తరగతి మార్కుల జాబితా, హాల్‌టికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రెండు ఫొటోలతో దరఖాస్తులను ఆర్డీటీ ఫీల్డ్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

హుండీ అపహరణ

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరు కనుమలో వెలసిన పురాతన కనుమ వేంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీని దుండగులు అపహరించుకెళ్లారు. ఆలయ ప్రాంగణంలో నాలుగు హుండీలు ఉండగా... గర్భాలయానికి ఎదురుగా ఉన్న హుండీని ఆదివారం మధ్యాహ్నం దుండగులు అపహరించుకెళ్లినట్లు పోలీసులకు ఆలయ పాలక మండలి వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

అమడగూరు: మండలంలోని శీతిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రభాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలియజేశారు. తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు వెంటనే కళాశాలలో సంప్రదించాలన్నారు. ఫీజులు చెల్లించలేని విద్యార్థులకు కళాశాల సిబ్బంది, దాతల సహకారంతో ఫీజులు కడతామన్నారు. నాడు-నేడు పథకం ద్వారా కళాశాలలో అన్ని వసతులు కల్పించామన్నారు.

ఎమ్మెల్యే కాన్వాయ్‌పై దాడి కేసులో వ్యక్తి అరెస్ట్

సోమందేపల్లి: ఈ నెల 1న సోమందేపల్లి మండలం రేణుకానగర్ వద్ద ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ కాన్వాయ్‌పై దాడికి పాల్పడిన కేసులో ఈదులబలాపురం నివాసి నాగభూషణం రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. నిందితుడిని న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి 14 రోజుల రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ

ముదిగుబ్బ: భూమి వివాదం కారణంగా ఘర్షణ పడి పరస్పరం దాడులు చేసుకున్న అన్నదమ్ములు తీవ్రంగా గాయపడ్డారు. ముదిగుబ్బ మండలం ఏబీపల్లితండాలో ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన మేరకు భూమి పంపకం విషయంగా గ్రామంలోని అన్నదమ్ములు బాలునాయక్, సోమ్లానాయక్ తరచూ గొడవపడేవారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం ఇద్దరి మధ్య మాటామాట పెరిగి ఇద్దరూ పరస్పరం దాడి చేసుకున్నారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు కదిరి ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి జ్యోతులు



బోనాలతో ఆలయానికి తరలివస్తున్న మహిళలు



ఉట్టిని అందుకునేందుకు పోటీ పడుతున్న యువకులు

గాండ్లపెంట: స్థానిక గంగాభవానీ ఆలయ 15వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున అమ్మవారికి జ్యోతులు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సమీప గ్రామాల నుంచి మహిళలు బోనాలతో తరలి వచ్చారు. పూజల్లో వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసులరెడ్డి పాల్గొని ఉత్సవాల నిర్వహణకు రూ.20వేలు విరాళాన్ని అందజేశారు. సాయంత్రం 6 గంటలకు ఉట్టి తిరునాల ఉత్కంఠగా సాగింది. ఎలుగూటివారిపల్లికి చెందిన యువకుల బృందం ఉట్టిని అందుకుని కేరింతలు కొట్టారు.

తండ్రి హత్య కేసులో కుమారుడి అరెస్ట్



నిందితుడిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

బ్రహ్మసముద్రం: ఆస్తి కోసం కన్నతండ్రినే హతమార్చిన కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను కళ్యాణదుర్గం రూరల్ సీఐ కె.శ్రీనివాసులు ఆదివారం వెల్లడించారు. బ్రహ్మసముద్రం మండలం గుడిపల్లికి చెందిన బోయ చెన్నమల్లప్ప(70)కు తిప్పేస్వామి, వెంకటేశులు అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరికి పెళ్ళిళ్లు చేసి తనకు ఉన్న భూమిని చెరో 6 ఎకరాలు చొప్పున మొత్తం 12 ఎకరాలను తండ్రి పంచి ఇచ్చాడు. అయితే తనకు అనువైన భూమిని పంచివ్వలేదంటూ కక్ష పెంచుకున్న పెద్ద కుమారుడు తిప్పేస్వామి... తండ్రిపై కత్తితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన చెన్నమల్లప్పను కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. ఘటనపై హత్య కేసు నమోదు చేసిన పోలీసులు... ఆదివారం భైరసముద్రం సమీపంలో ఆంజనేయస్వామి గుడి వద్ద తచ్చాడుతున్న నిందితుడు తిప్పేస్వామిని గుర్తించి అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో చొరవ చూపిన బ్రహ్మసముద్రం ఎస్‌ఐ పరుశురాముడు, కానిస్టేబుళ్లు జానకీరాం, యువరాజు, సురేంద్రను ఈ సందర్భంగా సీఐ కె.శ్రీనివాసులు అభినందించారు.

ఎస్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం: స్థానిక గిరిజన (ఎస్టీ) గురుకుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 3వ తరగతిలో 40 సీట్లకు గాను 32 సీట్లు ఎస్టీలకు, 5 ఎస్సీలకు, 2 బీసీలకు, 1 ఓసీకు కేటాయించారు. 4వ తరగతిలో 38, 5వ తరగతిలో 32, 6వ తరగతిలో 20, 7వ తరగతిలో 2, 8వ తరగతిలో 5, 9వ తరగతిలో 8 చొప్పున ఖాళీలు ఉన్నాయి. 4 వ తరగతి నుంచి 9 వరకూ ఖాళీగా ఉన్న సీట్లన్నీ బ్యాక్‌లాగ్ కింద ఎస్టీ విద్యార్థులకు కేటాయించారు.